క్లుప్తంగా

సాయికుమార్‌కు సన్మానం



సాయికుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండ గ్రామానికి చెందిన దేవపంగు సాయికుమార్ ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ కోయంబత్తూర్ నుంచి ఇటీవల డాక్టరేట్ పొందాడు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి ఆంజనేయులు మాట్లాడారు. సాయికుమార్‌కు డాక్టరేట్ పొందడం సంతోషకరమన్నారు. సాయిని ఆదర్శంగా తీసుకొని దళితులు ఉన్నతవిద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో బెజవాడ శ్రావన్, బైరి శ్రీను, కత్తి భగత్, కుడుముల రవి, చింత కుమార్, దేవపాకు పవన్ ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం మండల కేంద్రానికి చెందిన వల్లోజు మహేష్ తన జన్మదినం సందర్భంగా వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, మహేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



గంపలతో ఆలయానికి వస్తున్న మహిళలు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో సోమవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గంపలు, బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నడిగూడెం : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వాహనాలలో డబ్బు, మాదకద్రవ్యాలు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీస్వయంభూ వేంకటేశ్వరస్వామి నెలవారి కల్యాణాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు కందాళ శ్రీనివాసాచార్యులు ఘనంగా నిర్వహించారు. గతనెల 24న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించి నెలరోజులు పూర్తికావడంతో ఆచారం ప్రకారం నెలవారి కల్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని వేంకటేశ్వర స్వామికి పూలమాలలు, వస్త్రాలు, ప్రసాదాలు సమర్పించారు.

భూ వివాదంతో రోడ్డుకు అడ్డంగా రాళ్లు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం ఆవాస గ్రామమైన మద్దిరాంగడ్డ గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీరోడ్డుపై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూ వివాదంతో రాళ్లను అడ్డంగా పెట్టాడు. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ వీధికి సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆ రోడ్డు తక్కువ వెడల్పు ఉండడంతో గ్రామానికి చెందిన పలువురు రోడ్డుకు ఒక వైపున ఉన్న భూమిని ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేశారు. కాని ఆ భూమికి సంబంధించి కొందరు డబ్బులు చెల్లించకపోవడంతో సదరు భూయజమాని సీసీరోడ్డుపై నడవడానికి వీల్లేదంటూ రెండు రోజుల క్రితం రోడ్డుపై రాళ్లను అడ్డుగా వేశాడు. ఈ విషయంపై పలువురు గ్రామస్తులు గ్రామ ప్రత్యేక అధికారికి, ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో విషయం గ్రామంలో చర్చాంశనీయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఆ రోడ్డుకు అడ్డుగా వేసిన రాళ్లను తొలగింపజేసి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలు

రంగుల కేళీ హోలీ వేడుకలను కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కుల, మతాలకు అతీతంగా చిన్నారులు, పెద్దలు కలిసి ఆనందోత్సాహాలతో వేడుకను నిర్వహించుకున్నారు. అనంతరం ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో ప్రముఖులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- సాక్షినెట్‌వర్క్



మఠంపల్లి : కాల్వపల్లితండాలో హోలీ ఆడుతున్న యువకులు



పాలకవీడు : హోలీ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు



హుజూర్‌నగర్ : రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



నడిగూడెం : కాగితరామచంద్రాపురంలో పాల్గొన్న చిన్నారులు



మునగాల : ఆకుపాములలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత



మఠంపల్లిలో చిన్నారులు..



కోదాడరూరల్ : శ్రీమన్నారాయణ కాలనీలో



మేళ్లచెరువులో..



నేరేడుచర్లలో హోలీ ఆడుతున్న మహిళలు



హుజూర్‌నగర్‌రూరల్ : హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



చిలుకూరు : బేతవోలులో..

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



వేడుకలో పాల్గొన్న వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

మునగాల : మండలంలోని రేపాల శివారులోని గుట్టపై వెలసిన శ్రీస్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. తొలుత దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి ఎదుర్కోళ్లు నిర్వహించారు. ఈ కల్యాణమహోత్సవానికి ఆయా గ్రామాల నుంచి మూడువేల మంది భక్తులు హాజరై వీక్షించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు చివలూరి రామకృష్ణాచార్యులు, అర్చక స్వాములు చివలూరి విఖసనచార్యులు, చివలూరి సాయి కృష్ణమాచార్యులు కల్యాణోత్సవ వ్యాఖ్యాతగా చివలూరి లక్ష్మీనరసింహాచార్యులు వ్యవహరించారు. దేవాలయ కమిటీ చైర్మన్ సారిక చినరామయ్య ఆధ్వర్యంలో కల్యాణమహోత్సవానికి హాజరైన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి దంపతులు, మునగాల ఎంపీపీ ఎలక బిందు–నరేందర్‌రెడ్డి దంపతులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుల పండువగా కుంకుమార్చన..

శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజైన సోమవారం ఉదయం మహిళలు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి గరుడసేవ నిర్వహించారు.

తొగర్రాయిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల శ్రీసంతాన వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం దేవతాహ్వానం, మండప పూజలు, భేరీ, హోమ పూజలు నిర్వహించి సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందించారు. మహోత్సవాల్లో భాగంగా ఇక్కడి ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే ఈ ఆలయానికి సంతాన వేణుగోపాలస్వామి అని పేరువచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఎదుర్కోళ్లు, దివిటీ ఉత్సవం, స్వామి వారి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ యాదా వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు యాదా రమేష్, శ్రీనివాసరావు, నరసింహారావు, సురేష్, సభ్యులు నందుల శాస్త్రీ, హనుమంతరావు, సింగరయ్య, ఏడుకొండలు, వీరాబు, భక్తులు పాల్గొన్నారు.



హోమ పూజలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో యలమంచమ్మ జాతర



అమ్మవారికి బోనాలతో వస్తున్న మహిళలు

గరిడేపల్లి : మండలంలోని కాచవారిగూడెంలో సోమవారం యలమంచమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ మంద గంపలను ఎత్తుకొని, ప్రభబండ్లతో యలమంచమ్మ అమ్మవారి వద్దకు ఊరేగింపుగా తెల్లవారుజామున చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



జాతరలో ప్రభబండ్లు

మట్టపల్లి ఆలయంలో మంత్రి ఉత్తమ్ పూజలు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సోమవారం సాయంత్రం రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ సంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మంత్రిని శేషవస్త్రాలతో సన్మానించి, ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, నాయకులు తదితరులు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

మండలంలోని యాతవాకిళ్లకు చెందిన మాజీ వార్డు సంభ్యులు, నాయకులు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన మాజీ వార్డుసభ్యులు బైరి నాగయ్య, జ్యోతిలింగరాజు, రమణాసైదులు, జవ్వాజి సైదులు పలువురు పార్టీలో చేరగా వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంటిపులి శ్రీనివాస్, హుజూర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్‌రావు, స్థానిక మాజీ సర్పంచ్ కాశయ్య, నాగరాజు, తదితరులు ఉన్నారు.



పూర్ణకుంభంతో మంత్రి ఉత్తమ్‌కు స్వాగతం పలుకుతున్న ధర్మకర్తలు, అర్చకులు



మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ వార్డు సభ్యులు, నాయకులు

కళాకారుల సేవలు చిరస్మరణీయం

మునగాల : నాటి కళాకారుల సేవలు చిరస్మరణీయమని గవిని ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని రేపాల గ్రామంలో రేపాల వెలుగు నాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రముఖ నాటక రచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు శతజయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు ఆంజనేయులు మాట్లాడారు. ఎంతో మందిని కళాకారులుగా తయారుచేసిన గొప్ప వ్యక్తి కేఎల్‌రావు అన్నారు. ఆయన తెలంగాణ తొలి మాండలిక రచయితగా పేరుపొందాడని అన్నారు. ఆయన నాటకాలపై పరిశోధన చేసి డా.రాజేశ్వరి పీహెచ్‌డీ పట్టా పొందారన్నారు. రాష్ట్రంలో మారుమూలన ఉన్న రేపాల గ్రామానికి గుర్తింపు తెచ్చిన నాటి కళాకారులను స్మరించుకోవడం తమ అదృష్టమన్నారు. అనంతరం ఆనాటి కళాకారుల వారసులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ సారిక చినరామయ్య, గ్రామపెద్దలు పందిరి పుల్లారెడ్డి, సీలకంతం రమేష్, బెజవాడ సీతారాములు, మాచర్ల రామయ్య, అక్కిరాజు గోపాలకృష్ణరావు, కందిబండ మోహన్‌రావు, కందిబండ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల వారసులను సన్మానిస్తున్న నిర్వాహకులు

అయ్యప్పస్వామికి భక్తుల ప్రత్యేక పూజలు



కోదాడ : అన్నదానంలో పాల్గొన్న నాయకులు



గరిడేపల్లి : పూజలు చేస్తున్న సీఐ చరమందరాజు

కోదాడ : అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా పట్టణానికి చెందిన అఖల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొళ్ల లక్ష్మీప్రసన్న, కోటిరెడ్డి, స్వామి, పుల్లయ్య, బత్తిని కృష్ణ, సీహెచ్ చంద్రశేఖర్, వెంకటేష్, సత్యనారాయణ, జగిని ప్రసాద్, కొండపల్లి వాసు, చలిగంటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని రాయినిగూడెంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా భక్తులు సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప కమిటీ, గ్రామపెద్దల సహకారాలతో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ సైదులు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పాత రామాలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు చిట్యాల శ్రీను, ఐలా శ్రీను, అలిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు నాగరాజు, మోహన్‌రెడ్డి, సురేష్, సత్యనారాయణ, రాజు, దుర్గారావు, సురేందర్, అమర్‌నాథ్, పెద్దిరాజు, వంశీ పాల్గొన్నారు.



నేరేడుచర్ల : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అప్పారికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోదాడ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాన్ని నిర్వహించిన యూటీఎఫ్ నిర్మాత అప్పారి వెంకటస్వామిని ప్రతి ఉపాధ్యాయుడు గుర్తుంచుకోవాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. సోమవారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ నిర్మాత అప్పారి వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, జనార్దన్, పిచ్చయ్య, ఉపేందర్, శ్రీనివాస్, బుచ్చయ్య, శ్రీనివాస్, కిశోర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

నేరేడుచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.20కోట్ల నిధులు మంజూరు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ నాయుడు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, స్నానాల గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతుల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.

చెక్‌పోస్టులో సీఐ తనిఖీ

మేళ్లచెరువు : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బుధవాడ వద్ద జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్ట్‌ను సోమవారం కోదాడరూరల్ సీఐ రజితరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఎస్ఐ.పరమేష్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడులో గల శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం నాగేంద్రస్వామికి పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం రథోత్సవం, ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం రాత్రి శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కల్యాణం సందర్భంగా ఆలయం వద్ద ఎద్దుల పందేలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేరేడుచర్ల : మండలంలోని దాసారం గ్రామంలో సోమవారం శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని సుప్రభాత సేవ, విశ్వేశ్వర పూజ, నూతన వస్త్రాలంకరణ, శాంతి కల్యాణం చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గోపయ్య, తిరుపతమ్మలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతమ్మ అమ్మవారికి బోనాలు

మేళ్లచెరువు : మండల కేంద్రంతో పాటు మండలంలోని వేపలమాధవరం, కందిబండ, కప్పలకుంటతండా గ్రామాల్లో శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం తమ మొక్కులను చెల్లించుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు